నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I | హైదరాబాద్, ఆదివారం 4 ఆగస్టు 2024 | RANGAREDDY

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక, అధికారులు

ప్లాట్ల క్రమబద్ధీకరణ పారదర్శకంగా చేపట్టాలి

రంగారెడ్డి, ఆగస్టు 3 (నమస్తే తెలంగాణ) : ప్లాట్ల క్రమబద్ధీకరణను పారదర్శకంగా చేపట్టాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అధికారులకు సూచించారు. యూఎల్‌బీలలోఎల్‌ఆర్‌ఎస్ అప్లికేషన్ల ప్రాసెసింగ్‌పై ఖమ్మం జిల్లా నుంచి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర సచివాలయం నుంచి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్, భూపరిపాలన ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ ఆధ్వర్యంలో శనివారం జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో రంగారెడ్డి జిల్లా నుంచి కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్లు ప్రతిమా సింగ్, భూపాల్‌రెడ్డిలు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరం నుంచి పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ ప్రభుత్వ ఉత్తర్వులలో పేర్కొన్న విధంగా క్రమబద్ధీకరణ చార్జీల చెల్లింపులు.. అనధికారిక ప్లాట్లు, లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం జారీ చేసిన విధానంపై మున్సిపల్ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బడంగ్‌పేట, తుర్కయాంజాల్, పెద్దంబర్‌పేట్, షాద్‌నగర్‌లలో ఎల్‌ఆర్‌ఎస్ అప్లికేషన్లు ఎక్కువగా ఉన్నాయన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌లో ప్లాట్ క్రమబద్ధీకరణకు మూడు స్థాయిల్లో పరిశీలించాలన్నారు. డీపీవో, మున్సిపల్ కమిషనర్లు జీవో నం.131ని క్షుప్తంగా అవగాహన చేసుకుని ముందుకు పోవాలని సూచించారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనకు రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ శాఖల అధికారులతో కూడిన మల్టీ డిసిప్లినరీ బృందాలను ఏర్పాటు చేయాలని, స్థానిక సంస్థల కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీపీవో సురేశ్ మోహన్, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వికారాబాద్ కలెక్టరేట్‌లో..

వికారాబాద్ : సరళీకృత చెల్లింపు పథకం (ఎల్‌ఆర్‌ఎస్) ద్వారా భూములు క్రమబద్ధీకరణకు అధికారులు చర్యలు చేపట్టాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. శనివారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ జిల్లాలోని మున్సిపల్, గ్రామపంచాయతీ పరిధిలోని అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ పారదర్శకంగా చేపట్టాలన్నారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలలో 20968, గ్రామపంచాయతీల పరిధిలో 12745 క్రమబద్ధీకరణకు వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి మార్గదర్శకాలకు అనుగుణంగా పరిష్కారం దిశగా అడుగులు వేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేని లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణను మూడు దశల్లో ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను చేపట్టేందుకు వీలుగా కమిటీలను రూపొందించాలన్నారు. భూముల క్రమబద్ధీకణపై జిల్లా, మండల, మున్సిపాలిటీ పరిధిల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, ట్రైనీ కలెక్టర్ ఉమా హారతి, డీపీవో జయసుధ, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

పేరు ఒకరిది ఆధార్ నంబర్ మరొకరిది

ఆధార్ మిస్‌మ్యాచ్, రేషన్‌కార్డు లేకపోవడంతో వర్తించని మాఫీ..

గ్రీవెన్స్‌లో అధికంగా ఈ ఫిర్యాదులే..

వేలల్లో ఫిర్యాదులు

రుణమాఫీ కాలేదంటూ కార్యాలయాల బాట పట్టిన అన్నదాతలు

వికారాబాద్, ఆగస్టు 3 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో రుణమాఫీ జాబితా తప్పుల తడకగా మారింది. పలు బ్యాంకులు ప్రభుత్వానికి ఇచ్చిన రుణాలు తీసుకున్న రైతుల జాబితాతో రైతులు అటు వ్యవసాయ కార్యాలయాల చుట్టూ, ఇటు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయితే బ్యాంకర్లు ఇచ్చిన రుణమాఫీ జాబితాలో రైతుల వివరాలను తప్పుగా నమోదు చేయడమే ఇందుకు కారణమని సంబంధిత అధికారులు గుర్తించారు. ఓ వైపు ప్రభుత్వం పెట్టిన షరతులతో అర్హులైన చాలా మంది రైతులు నష్టపోగా, మరోవైపు బ్యాంకర్లు చేసిన తప్పిదాలతో మరికొంత మంది రైతులు రుణమాఫీకి దూరమయ్యారు. అయితే రూ.లక్షన్నర వరకు రుణమాఫీ ప్రక్రియ పూర్తి అయ్యిందని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ అర్హులైన రైతులకు కూడా అన్యాయం జరిగింది. రుణమాఫీ కాని రైతుల సంఖ్య అధిక మొత్తంలో ఉండడంతో కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేయడంతోపాటు జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలోని టెక్నికల్ సెక్షన్‌లో, మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో, క్షేత్రస్థాయిలో క్లస్టర్ల వారీగా ఏఈవోలను రుణమాఫీ కాని రైతుల విజ్ఞప్తులను స్వీకరిస్తున్నారు. అయితే జిల్లా వ్యవసాయాధికారులు చెబుతున్న ప్రకారం ఇప్పటివరకు రుణమాఫీ కాలేదని 2 వేల మంది రైతుల నుంచి ఫిర్యాదులు అందినట్లు చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో రైతులతో మాట్లాడితే అర్హులైనప్పటికీ రుణమాఫీ కాని రైతుల సంఖ్య అధికంగా ఉన్నట్లు తెలుస్తున్నది.

తప్పుల తడకగా రుణమాఫీ జాబితా...

పేరు ఒకరిది ఆధార్ నెంబర్ మరొకరిది...రైతుల పేర్లు తప్పుగా నమోదు చేయడం...ఆధార్‌లో ఉన్న పేరుకు పట్టాదారు పాసుపుస్తకంలో ఉన్న పేరు ఒకేలా ఉండకపోవడం..ఇలా రుణమాఫీ జాబితా తప్పుగా నమోదు నమోదుతో చాలా మంది రైతులు నష్టపోయారు. జిల్లాలో ఇప్పటివరకు వచ్చిన గ్రీవెన్స్‌లో 70 శాతం వరకు ఆధార్ నంబర్ సరిలేకపోవడం, రేషన్‌కార్డు లేకపోవడం, రైతు పేరును తప్పుగా ఎంట్రీ చేయడం వంటి ఫిర్యాదులే ఎక్కువగా ఉన్నాయి. అయితే కొన్ని బ్యాంకులు ఇచ్చిన జాబితాలో తప్పుగా ఎంట్రీ చేయడంతోనే చాలా మంది రైతులు అర్హులైనప్పటికీ రుణాలు మాఫీ కాలేదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. అయితే ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా వ్యవసాయాధికారులు చెబుతున్న లెక్కల ప్రకారం 2 వేల వరకు ఫిర్యాదులురాగా, ఆధార్ నెంబర్ సరిలేకపోవడం(మిస్‌మ్యచ్), వీటిలో కుటుంబ నిర్ధారణ కాకపోవడం(రేషన్ కార్డులేకపోవడం) ఫిర్యాదులే అధికంగా ఉన్నాయి. రైతుల బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం ఎప్పుడో పూర్తైనప్పటికీ, బ్యాంకర్లు ప్రభుత్వానికి అందజేసే రైతుల వివరాలను నమోదు చేసే సమయంలో తప్పుగా ఎంట్రీ చేయడంతోనే రైతులు నష్టపోవాల్సి వచ్చింది. అయితే ప్రభుత్వం సమయం ఎక్కువగా ఇవ్వకుండా తక్కువ సమయంలోనే రుణమాఫీ జాబితాను పంపాలని ఆదేశించడంతోనే తప్పులు జరిగినట్లు బ్యాంకర్లు చెప్పుకొస్తుండడం గమనార్హం.

అంతేకాకుండా మొదట రెన్యూవల్ కాని రైతుల జాబితా సేకరించిన అనంతరం మళ్లీ రెన్యూవల్ చేసుకున్న జాబితా పంపాలని ఆదేశించారు, అయితే మొదట పంపిన జాబితానే ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవడంతో కూడా రైతులకు నష్టం జరిగిందని బ్యాంకర్లు చెబుతున్నారు. మరోవైపు అర్హులైన రుణమాఫీ కాని రైతులు జిల్లా కలెక్టర్‌కు తమ పంట రుణాలు రూ.లక్షన్నరలోపు ఉన్నప్పటికీ రుణమాఫీ కాలేదని ఫిర్యాదు చేయగా, సదరు బ్యాంకర్లతో సమావేశమైన కలెక్టర్ తప్పుగా ఎంట్రీ చేయడంతో నష్టపోయిన రైతుల వివరాలను అందజేయాలని, ప్రభుత్వానికి అందజేస్తామని చెప్పినట్లు తెలిసింది. అయితే ఇప్పటికే రూ.లక్షన్నరలోపు రుణాలు మాఫీ కావడంతో ప్రత్యేకంగా రుణమాఫీ చేపట్టడం సాధ్యమా అనే సందేహాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు.

మాదక ద్రవ్యాలపై నిఘా పెట్టాలి

ఎస్పీ నారాయణరెడ్డి

పూడూరు, ఆగస్టు 3 : యువకుల జీవితాలను నాశనం చేస్తున్న డ్రగ్స్ గంజాయి విక్రయదారులపై ప్రత్యేక నిఘా పెట్టాలని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి పేర్కొన్నారు. శనివారం పూడూరు మండలం చంగముల్ పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరుగకుండా వాహనదారులకు పలు సూచనలు చేయాలని తెలిపారు. అధిక శాతంలో మద్యం సేవించి వాహనాలు నడపడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. రోడ్ల మార్గంలో, గ్రామాల్లో సీసీ కెమెరాలను దాతల సాయంతో ఏర్పాటు చేయాలన్నారు. భూములకు అధిక రేట్లు ఉండడంతో భూ తగాదాలు జరుగుతున్నాయని వాటి నివారణకు ప్రయత్నించాలని తెలిపారు. అక్రమ రోడ్డు రవాణాపై దృష్టి పెట్టాలన్నారు. పోలీస్ సిబ్బంది నిత్యం వ్యాయామం చేస్తూ ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. ప్రజలతో ఫ్రెండ్లీగా ఉంటూ శాంతిభద్రతలను కాపాడాలన్నారు. వీరితో పాటు పరిగి డీఎస్పీ కరుణాసాగర్ రెడ్డి, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మధుసూదన్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

పూడూరు మండలం చంగముల్ పోలీస్‌స్టేషన్ సందర్శించిన ఎస్పీ నారాయణరెడ్డి

రోడ్డుపై బురదలో నాట్లు వేసి నిరసన

పరిగి, ఆగస్టు 3 : పరిగి మున్సిపాలిటీ 5వ వార్డులోని ప్రధాన రహదారి బురదమయంగా మారినా ఎవరూ పట్టించుకోవడం లేదని పేర్కొంటూ కాలనీవాసులు శనివారం రోడ్డుపై బురదలో నాట్లు వేసి నిరసన తెలిపారు. పట్టణంలోని కొడంగల్ క్రాస్‌రోడ్డు నుంచి బాలాజీనగర్, వెంకటేశ్వర స్వామి దేవాలయం రోడ్డు వర్షపు నీటితో బురదమయంగా మారింది. ఈ విషయమై పలుమార్లు మున్సిపల్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని, గుంతలు పూడ్చి రోడ్డును బాగు చేయాలని కోరినా అధికారులు ఇటువైపు రావడం లేదని కాలనీవాసులు ఆరోపించారు. తమ కాలనీలో ప్రధాన రహదారి, మురికి కాలువల నిర్మాణం సైతం చేపట్టలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై గుంతలు పూడ్చి రవాణాకు అనుగుణంగా మార్చాలని కోరారు.

బురదమయమైన రోడ్డుపై నాట్లు వేస్తున్న కాలనీవాసులు

తడి కన్నులనే.. తుడిచిన నేస్తమా..

నీకెక్కువ, నేను తక్కువ అన్న భేదం లేదు.. మనసు విప్పి మాట్లాడితే ఎక్కడ చులకనైపోతామేమో అన్న ఆందోళ నా లేదు. తరగతి గదిలో కింద బండలపైనే కూర్చున్నా తక్కువైపోతామేమో అన్న ఆలోచనే రాలేదు.. పక్కోడు ఏమనుకుంటాడోనన్న బెంగ లేదు.. ఉన్నదాంట్లోనే సర్దుకుంటూ, ఒకరి భుజాలపై ఒకరు చెయ్యేసి నడుస్తుంటే కలిగిన భరోసానే వేరు.. ఫోన్‌ల ఫోబియా లేదు.. సోషల్‌మీడియా లొల్లి అసలే లేదు.. అందుకే స్నేహమంటే అదే.. కాలమంటే అదే. ఆ కల్మశం లేని దోస్తానా మళ్లీ వస్తే బాగుండని కోరుకునే వారెందరో. లేదంటే కనీసం ఆ జ్ఞాపకాలను అందరితో కలిసి నెమరువేసుకున్నా ఆ సంతోషమే వేరు అనే దోస్తులెదందరో.. అందుకే పూర్వ విద్యార్థుల సమ్మేళనాల పేరుతో అందరూ ఒక చోట కలిసి సందడిచేస్తున్నారు. అంతేకాదు తమ మిత్రుల్లో ఎవరైనా కష్టాల్లో ఉన్నరని తెలిస్తేచాలు...అందరూ ఏకమవుతున్నారు.. మేమున్నామని భరోసానిస్తున్నారు... ఈ రోజు స్నేహితుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

- పెద్దఅంబర్‌పేట, ఆగస్టు 3

- చిన్ననాటి విషయాలను గుర్తు చేసుకుంటున్న స్నేహితులు
- పాత దోస్తులను కలుసుకునేందుకు ఏర్పాట్లు
- దశాబ్దాల అనంతరం పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు
- అవసరమైన వారికి చేయూతనందిస్తున్న మిత్రబృందం

నేడు స్నేహితుల దినోత్సవం

దశాబ్దం, రెండు దశాబ్దాలు, మూడు దశాబ్దాలు, నాలుగు దశాబ్దాలు.. ఏండ్లు గడిచిపోయాయి. బడిలో కలిసి చదువుకున్న రోజులు మాత్రం ఇప్పటికీ కండ్లముందే తిరుగుతున్నాయి. పలానా రోజు జరిగిన ఘటన, ఆ సార్ కొట్టిన దెబ్బలు, టీచర్ తిట్టిన తిట్లు.. రిపోర్టు కార్డు చూసుకుని దిగాలు పడ్డ సందర్భాలు.. జారిపడి తగిలిన గాయాలు ఇలా ఎన్నో, మరెన్నో.. ఏ సందర్భం గుర్తుకొచ్చినా మొదట కనిపించేది పెదవులపై చిరునవ్వే. చేసిన చిలిపి పనయినా, దాని పర్యవసానం ఇంకేమైనా ఇప్పుడు గుర్తుకొస్తే మాత్రం వచ్చేది నవ్వే. అందుకేనేమో ఎట్టి పరిస్థితుల్లోనూ మళ్లీ పాత దోస్తులను కలువాలని కోరుకుంటున్నవారు ఎక్కువవుతున్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనాల పేరుతో మళ్లీ ఒక్కచోటకు చేరేందుకు ఇష్టపడుతున్నారు. ఎలాగైనా మళ్లీ పాత దోస్తులను కలవాలని తపన పడుతున్నారు. తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకోవాలని ఆరాటపడుతున్నారు. కలిసి మళ్లీ భుజాలపై చేతులేసి నడుస్తూ ఒకరికొకరు భరోసా ఇవ్వాలని ఆసక్తి చూపుతున్నారు. తమ చిన్నతనంలో చేసిన తప్పులను అంగీకరించాలని కూడా ఆసక్తి చూపుతున్నవారెందరో. ఒక్కసారి తప్పు ఒప్పుకొంటే.. ఇక జీవితాంతం మరింత సంతోషంగా ఉండొచ్చని, ఆనందంగా మరింత దగ్గర కావొచ్చని చూస్తున్నవారెందరో. చెడు అలవాట్లను దూరం చేసుకున్న సందర్భాలను తెలుసుకుంటూ స్ఫూర్తి పొందేందుకు సైతం పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు ఉపయోగపడుతున్నాయి. ఒకప్పుడు ఆర్థికంగా వెనుకబడినా, తాను కష్టపడి ఉన్నత స్థానంలో ఉండేందుకు పడిన కష్టం, వచ్చిన ఫలితం ఇలా అన్నింటినీ నిర్మొహమాటంగా స్నేహితుల ముందు చెప్పేస్తున్నారు. తాము స్ఫూర్తి పొందిన గురువులను గుర్తు చేసుకుంటూ వారిని సన్మానిస్తున్నారు. చదువులు చెప్పిన గురువుల చేత శభాష్ అనిపించుకుంటున్నారు. 'అరేయ్.. నేను నిన్ను మరిచిపోలేదు. నువ్వు చేసిన పని ఇంకా నాకు గుర్తుంది' అని గురువుల నోట వచ్చే మాటల కోసం ఎదురుచూస్తున్నారు. ఆ మాటలు వింటూ తోటి స్నేహితులతో సంతోషాలు పంచుకుంటున్నారు. 'ఏం రా.. నిన్న బడికెందుకు రాలేదు. అన్న సార్ ప్రశ్నకు.. పనుండె సార్ అన్నది విద్యార్థి జవాబు.. ఆహా.. పని లేకపోతెనే బడికొస్తావా?' అంటూ సార్ కొట్టిన రెండు దెబ్బలను ఇప్పటికీ మరిచిపోలేనని చెప్తున్నారు ఏడు దశాబ్దాల వయసున్న సుదర్శన్.

కష్టాల్లో తోడుగా...

అపూర్వ సమ్మేళనాలతో ఒక్కచోటకు చేరుతున్న స్నేహితులు.. జ్ఞాపకాలను గుర్తు చేసుకోవడంతో పాటు కష్టాల్లో ఉన్నవారికి మేమున్నామంటూ చేయూతనిచ్చేందుకు వెనుకాడటంలేదు. అనారోగ్యం, ఇతర సమస్యలతో బాధపడుతున్న స్నేహితులకు బాసటగా నిలుస్తున్నారు. 'మాది 1996 పదోతరగతి బ్యాచ్. ఓ స్నేహితుడి ఆరోగ్యం బాగాలేదని తెలుసుకుని సాయం అందించాం' అని మున్సిపాలిటీకి చెందిన జాల జంగయ్య తెలిపారు.

సంతోషాలకు వేదిక

పాత స్నేహితులందరం ఒక్కచోటకు చేరాలని కొందరు పక్కాగా ప్లాన్ చేస్తున్నారు. కష్టమైనా అందరి ఫోన్ నంబర్‌లు సేకరిస్తున్నారు. ఇందుకోసం సోషల్‌మీడియాను ఆశ్రయిస్తున్నారు. ఒక్కచోట ఒక్కరోజులో చదివిన పదేండ్ల జ్ఞాపకాలను గుర్తుచేసుకునేలా సమ్మేళనాలు ఏర్పాట్లు చేస్తున్నారు. కష్టసుఃఖాలను పంచుకుంటున్నారు.

తీపి జ్ఞాపకాలు.. మధురస్మృతులు..

స్నేహితుల దినోత్సవాన సోషల్‌మీడియా వేదికగా తమ తీపి జ్ఞాపకాలను పంచుకునేందుకు ఎక్కువమంది స్నేహితులు ఇష్టపడుతున్నారు. చిన్నప్పుడు దిగిన ఫొటోలను షేర్ చేసూ.. ప్రాణ స్నేహితులను గుర్తుచేసుకుంటున్నారు. స్నేహితుల సాయం పొందినవారు దోస్తుల గొప్పతనాన్ని సోషల్‌మీడియా వేదికగా గుర్తు చేసుకుంటున్నారు. బడిలో, బయట జరిగిన చిలిపి చేష్టలు, మధుర జ్ఞాపకాల చిత్రాలు, పూర్వ విద్యార్థుల సమ్మేళనాల ఫొటోలను షేర్ చేస్తున్నారు. మనకు మంచి చేసిన స్నేహితులను గుర్తు చేసుకునేందుకు ఫ్రెండ్‌షిప్‌డేను వేదికగా చేసుకుంటున్నారు. మరికొందరు స్నేహితుల దినోత్సవాన కలిసి సంతోషాలు పంచుకునేందుకు ప్లాన్ చేస్తున్నారు.

సండే స్పెషల్
SUNDAY SPECIAL